ఉద్యమ చరిత్ర పాఠ్యాంశం తొలగింపు నిర్ణయం దుర్మార్గం

అవినాష్ బాలెంల

ఉస్మానియా యూనివర్సిటీ: పదో తరగతి పుస్తకాల్లో పాఠ్యాంశంగా ఉన్న తెలంగాణ ఉద్యమ చరిత్రను తీసివేయడం దుర్మార్గమని బీఆర్ఎస్వీ నాయకుడు అవినాష్ బాలెంల అన్నారు. కొన్ని దశాబ్దాల కాలం తెలంగాణ ప్రజలకు ఉద్యోగాలు, సాగునీరు, అనేక రంగాల్లో జరిగిన అవమానాలు, అణచివేతకు గురై ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర చరిత్రను వచ్చే తరానికి తెలియజేయడం మన బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ఎంతో మంది విద్యార్థులు వారి ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా, తెలంగాణ వస్తే తమ తరాలు బాగుపడతాయని వారి ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. అలాంటి ఒక గొప్ప ఉద్యమ చరిత్రను తుడిచివేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం నడుచుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్ర చరిత్రలో ఏనాడూ, ఎక్కడా ఉద్యమంలో తాను లేనని, రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా ఇలా చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని రకాలుగా వక్రీకరించినా, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ తెలంగాణ ద్రోహిగానే మిగులుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏనాటికి దీనిని మరచిపోదని అన్నారు. పాఠ్యాంశం తొలగింపు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించి పాఠ్యాంశాన్ని తిరిగి చేర్చేలా పోరాడుతామని అన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తగవు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో పాటు ఎస్సార్‌నగర్ బస్తీవాసులు

బేగంపేట్, జూన్ 12: ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అమీర్‌పేట డివిజన్ ఎస్సార్‌నగర్‌లో గల పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. స్థానికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సార్‌నగర్‌లో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని వేలం ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని కాలనీవాసులు పేర్కొన్నారు. దీనిని అడ్డుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.13 కోట్ల వ్యయంతో 2606 గజాల విస్తీర్ణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫంక్షన్‌హాల్, డైనింగ్‌హాల్, పార్కింగ్, షాప్‌లతో కూడిన కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టిందని వివరించారు. ఇందులో దాదాపు 80 శాతం మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా, విక్రయించాలని చూడటం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే విధంగా పనిచేయాలి తప్ప నష్టం కలిగించేలా వ్యవహరించడం తగదని హితవు పలికారు. ఈ కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే వేలాది మందికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. హాల్ వేలం జరగకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని తనను కలిసిన పలు కాలనీల అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఎస్ఆర్‌నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, బీ టైప్ అధ్యక్షుడు రాజేష్, గౌతమ్‌రెడ్డి, వివేక్‌నాథ్, పెంటయ్య, కృష్ణకాంత్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సెట్విన్ కార్యకలాపాలు ఆదర్శం

సీతాఫల్‌మండి చౌరస్తాను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యతో కలిసి పరిశీలిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, జూన్ 12: సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రం కార్యకలాపాలు ఆదర్శంగా నిలుస్తాయని, యువతకు ఉపాధిని కల్పించేందుకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సీతాఫల్‌మండిలోని సెట్విన్ కేంద్రాన్ని మల్లయ్యయాదవ్ గురువారం సందర్శించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలోనే సికింద్రాబాద్ సెట్విన్ మోడల్‌గా నిలిచేలా జరిగిన ఏర్పాట్ల పట్ల ఆయన ప్రశంసించారు. హరిత వనాలు ఏర్పాటు చేయాలి సీతాఫల్‌మండిలోని అంబేద్కర్ కూడలిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన సీతాఫల్‌మండి అంబేద్కర్ కూడలి సుందరీకరణ పనులను పరిశీలించారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు సువర్ణ, కౌశిక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులే దేశాభివృద్ధికి పునాదులు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూన్ 12: పిల్లలను పనిలో పెట్టకుండా పాఠశాలలకు పంపించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గురువారం ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభ సందర్భంగా నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించిన బడిబాట యాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలే దేశాభివృద్ధికి పునాదులనీ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే దేశభక్తితో అన్ని రంగాల్లో ముందుంటారని అన్నారు. ప్రభుత్వం అన్ని రకాల వసతులతో ఉచిత విద్యను అందిస్తుందన్నారు. మండల స్థాయిలో పదో తరగతి పరీక్షల్లో మొదటి రెండు ర్యాంకులు కైవసం చేసుకుందని అన్నారు. అనంతరం ఉప విద్యాధికారి శ్రవణ్‌కుమార్ విద్యార్థులకు ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులు ముత్యాల రవీందర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భవాని, టీచర్లు ఎం.నర్సింహారెడ్డి, కవిత, సుజిత, భాగ్యలక్ష్మి, నాగమణి, దుర్గ, రమేష్, అనిల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సురేందర్, అనురాధ, శ్రీనివాసరెడ్డి, యూనిస్, హరీష్, మోజస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిన్నారులకు యూనిఫాం, నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎలా బతకాలన్నది బడే నేర్పుతుంది

కవాడిగూడ: ఎలా బతకాలన్నది బడే నేర్పుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కార్పొరేటర్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. గురువారం కవాడిగూడ చిత్రాల నర్సింహులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, డిప్యూటీ ఐఓఎస్ జయభారతిలతో కలిసి యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, అందజేశారు. కవాడిగూడ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలను సాధించడం అభినందనీయమన్నారు. కవాడిగూడ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం మీనాకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పావన, టీచర్లు డాక్టర్ నాగయ్య, సుబ్రహ్మణ్యం, జాని, వంశీ, వసంత, సమత, వీణ, శైలజ, శిరీష, అనీల్‌కుమార్, సంధ్య, స్వప్న, బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, చిత్రాలనగర్ శ్రీహరి, రాజశేఖర్‌గౌడ్, రూప పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించేందుకు కృషి

చిక్కడపల్లి: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట నిర్వహించారు. ఎమ్మెల్యే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, నాయకులు పున్న సత్యనారాయణ, పాశం రవి, జి.వెంకటేష్, ఎం.దేవయ్య, పి.రాజ్‌కుమార్, హనుమంతు, పి.సుధాకర్, ఎన్.శ్రీహరి, ఎం.ఆనంద్‌కుమార్, పీఎస్ శ్రీనివాస్, మందుల నర్సయ్య, ఎం.రత్నయ్య, కడెం రామ్, అశోక్, శివ, లడ్డు, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చాచానెహ్రూనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న రెయిన్‌బో ప్రతినిధులు

పిల్లలను పనికి కాదు.. బడికి పంపండి

బన్సీలాల్‌పేట్: ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినం సందర్భంగా గురువారం చాచానెహ్రూనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెయిన్‌బో కమ్యూనిటీ కేర్, లర్నింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చదువుకునే వయస్సు కలిగిన పిల్లలను పనికి కాకుండా బడికి పంపి వారి అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం నేరమని గుర్తించాలని కోరారు. రెయిన్‌బో హోమ్స్ ఇన్‌చార్జ్ సుజాత, కోఆర్డినేటర్ సంధ్యారాణి, సిబ్బంది వెంకటలక్ష్మి, నికిత, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా రాగ సప్తస్వరం వార్షికోత్సవం

పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ వాణీదేవి

ముషీరాబాద్, జూన్ 12: రాగ సప్తస్వరం సాంస్కృతిక సాంఘిక సేవా సంస్థ, మానేపల్లి జ్యువెలర్స్ ఆధ్వర్యంలో 40వ వార్షికోత్సవం గురువారం త్యాగరాయ గానసభలో ఘనంగా జరిగాయి. సామాజిక స్పృహ పెంపొందించే వివిధ అంశాలపై సర్వమంగళ గౌరీ, డాక్టర్ శరత్ జ్యోత్స్నరాణి, డాక్టర్ జ్యోత్స్నరావు, డాక్టర్ రమ్య వలివేరు, డాక్టర్ విజయ భాస్కర్ క్యాన్సర్ తదితర అనారోగ్య సమస్యలపై ప్రసంగించారు. సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ వాణీదేవి వివిధ రంగాల ప్రముఖులను సత్కరించారు. ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీ రామకృష్ణ, శ్రీమణి, వంశీ రామరాజు, సంస్థ స్థాపకులు వీఎస్ రాజ్యలక్ష్మి, ఆమని తదితరులు పాల్గొన్నారు.

రోజాపూలు చాక్లెట్స్‌తో విద్యార్థులకు స్వాగతం

విద్యార్థులతో కేక్ కట్ చేపిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రవి, తహసీల్దార్ తదితరులు

బేగంపేట్, జూన్ 12: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. రాంగోపాల్పేట్ డివిజన్లోని నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను హైదరాబాద్ జిల్లా డిప్యూటీ కలెక్టర్ రవి, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్లు సందర్శించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం వారికి రోజా పూలు, చాక్లెట్స్ అందిస్తూ స్వాగతం పలికారు. విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, యూనిఫాంలు అందజేశారు. ప్రతిఒక్క విద్యార్థి శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శౌరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్ ఆధ్వర్యంలో నిరసనలు

కవాడిగూడ, జూన్ 12: పెంచిన బస్‌పాస్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. దోమలగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు పెరుగుతున్న ధరలతో ఒకవైపు సతమతమవుతుంటే బస్‌పాస్ చార్జీలు పెంచడంతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఆరు వాగ్దానాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్పితే ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచి మహిళల ఉచిత బస్సు బడ్జెట్‌ను దొడ్డిదారిన వసూలు చేసుకుంటుందని ఆరోపించారు. సామాన్యుల జేబులకు చిల్లులు పడే విధంగా చార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమండ్ చేశారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని నేడు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బస్ భవన్ వద్ద 12 గంటలకు నిరసన కార్యక్రమం చేపడతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆమ్‌ఆద్మీ పార్టీ వలంటీర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

భోలక్‌పూర్‌లో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించిన టీచర్లు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కవాడిగూడ, జూన్ 12: ఇందిరాపార్కు సబ్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడ, గోశాల పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. కవాడిగూడ 11కెవి పరిధిలో మెయింటనెన్స్ పనుల్లో భాగంగా మారియట్ హోటల్ ఎదురు ప్రాంతాలు, కవాడిగూడ పెట్రోల్‌పంప్ పరిసరాలు, కొత్తబజార్, హనుమాన్ టెంపుల్‌పరిసర ప్రాంతాలు, సండేబజార్, పద్మశాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, గోశాల పరిధిలోని లోయర్‌ట్యాంక్‌బండ్, అంబేద్కర్ భవన్ పరిసరాలు, గోశాల పరిసరాలు, రజకకాలనీ, సర్దార్‌జీ పంప్‌హౌజ్, తాతానగర్, సింగరిబస్తీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వ్యభిచారం నిర్వహణ.. నిందితుల రిమాండ్

బొల్లారం,జూన్ 12: గుట్టుచప్పుడు కాకుండా న్యూబోయిన్‌పల్లిలోని ఓ హోటల్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించిన సంఘటన బోయిన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ తిరుపతి రాజు తెలిపిన వివరాల ప్రకారం వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముగ్గురు యువకులు బోయిన్పల్లిలోని సప్తమి గ్రాండ్ హోటల్‌లో రిసెప్షన్‌గా పనిచేస్తున్న సంజీవ్ కుమార్‌యాదవ్‌తో పరిచయం ఏర్పాటు చేసుకొని గుట్టు చప్పుడు కాకుండా హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ యువతిని అదుపులోకి రెస్యూహోంకు తరలించారు. నిందితులు షేక్ సెబరుద్దీన్, బుర్హాన్‌ద్దీన్‌తోపాటు విటుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తుల పంపిణీ

నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

దూద్‌బావి బడిలో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

అడ్డగుట్ట: తుకారంగేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్స్, స్కూల్ యూనిఫారాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పవన్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దూద్‌బావి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన నోట్ బుక్స్ పంపిణీలో ప్రజావాణి సబ్ కలెక్టర్ సూర్యప్రకాష్, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత, డిప్యూటీ ఐఓఎస్ మదన్‌మోహన్ పాల్గొని బుక్స్ పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో బడిబాట..

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాకలో బడిబాట కార్యక్రమాన్ని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్ని చర్యలు తీసుకుంటోందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలతో పోల్చి ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాల వల్ల విద్యార్థులకు లభిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. పిల్లలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని గొప్ప విజయాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, డిప్యూటీ ఈవో బాలునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

బొల్లారం, జూన్ 12: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తిరుమలగిరి సీఐ నాగరాజు అన్నారు. గురువారం పాఠశాల పున:ప్రారంభం కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి ప్రభుత్వ ప్రాథమిక బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణితో కలిసి విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన వాతావరణంలో పిల్లల్ని ఎలా పెంచాలి, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్, టెక్నాలజీ వాడకంలో పుస్తకాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సికింద్రాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కూలు యూనిఫాం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు కె.స్వర్ణమాల, ఉపాధ్యాయులు కలిసి సమీపంలోని బస్తీలోకి వెళ్లి తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని విజ్ఞప్తి చేశారు. భోలక్‌పూర్‌లోని కృష్ణనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లు విజయరాణి, అనిత, ఆశ వర్కర్లు కలిసి అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. తాజాగా చిన్నారులకు కోడిగుడ్డు బిర్యానీ ఆహారంగా అందిస్తున్నామని వారు తెలిపారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఐ నాగరాజు, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి

యూనిఫాం అందజేస్తున్న సికింద్రాబాద్ మండల ఉప విద్యాశాఖ అధికారి శ్రీధర్



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్

విమాన దుర్ఘటనపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

చిక్కడపల్లి, జూన్ 12: ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనపై ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన విమానం టేకాఫ్ సమయంలో కూలిపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ దుర్ఘటనలో ప్రయాణికులు మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన ప్రయాణికుల కుటుంబాలకు కేంద్రం అండగా నిలవాలని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ప్రజా ఉద్యమాల నిర్మాణమే ఓంకార్‌కు నివాళి

చిక్కడపల్లి, జూన్ 12: హక్కుల రక్షణ కోసం ప్రజా ఉద్యమాల నిర్మాణమే – అమరజీవి కామ్రేడ్ ఓంకార్ గారికి అర్పించే నిజమైన నివాళులు అని పలువురు వక్తలు అన్నారు. ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి సందర్భంగా బాగ్లింగంపల్లిలోని ఎస్వీకేలో 'పౌరహక్కుల పరిరక్షణ–ఓంకార్ పాత్ర' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అధ్యక్షతన జరిగింది. పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ వల్లెపు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో నెలకొన్న ఆర్థిక సామాజిక పరిస్థితులు పరిష్కారం కావాలని అన్నారు. 78 ఏండ్ల స్వాతంత్ర్యంలో పౌర హక్కులకు రక్షణ లేదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక, పౌర హక్కుల, భావ ప్రకటన స్వేచ్ఛను లౌకిక వాదాన్ని పాలక వర్గాలు కాల రాశారని మండిపడ్డారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జేవీ చలపతిరావు, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఎంఎల్‌పీఐ రెడ్ ఫ్లాగ్ రాష్ట్ర కార్యదర్శి దొంతి రాజేష్, బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బోడుప్పల్/మేడ్చల్: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం, సమస్యల సత్వర పరిష్కారం కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు మేడ్చల్, చెంగిచెర్ల డిపో డీఎంలు సుధాకర్, కవిత తెలిపారు. మేడ్చల్ డీఎం 9959226152, చెంగిచెర్ల డీఎం 7893088433 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.